క్లుప్తంగా

జీవో నంబర్ 115 రద్దు చేయాలి



కె.కోటపాడు సీహెచ్‌సీ ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న స్టాఫ్ నర్సులు

కె.కోటపాడు : గత 15 ఏళ్లుగా స్టాఫ్ నర్సులుగా పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రతను కల్పించాలని స్టాఫ్ నర్సు ధన రాజ్యలక్ష్మి అన్నారు. కె.కోటపాడు సీహెచ్‌సీ ఎదుట గురువారం డిమాండ్ల సాధనకు నిరసన కార్యక్రమాన్ని స్టాఫ్ నర్సులతో కలిసి ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ధన రాజ్యలక్ష్మి మాట్లాడుతూ స్టాఫ్ నర్సులకు నష్టం కలిగించే జీవో నంబర్ 115ను రద్దు చేయాలని ఆమె కోరారు. పేద ప్రజలకు మంచి వైద్యం సకాలంలో అందించేలా పని చేస్తున్న స్టాఫ్ నర్సులను రెగ్యులరేజేషన్‌ను చేయాలని ఆమె కోరారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకూ రోగులకు ఇబ్బందులు లేకుండా నిరసన కొనసాగిస్తామన్నారు. నిరసనలో నాగమణి, అప్పలనర్స, ప్రధాని, పుష్పకళ, రేవతి పాల్గొన్నారు.

ఎస్ఐ సురేష్‌కు బదిలీ



రోలుగుంట : స్థానిక ఎస్ఐగా పని చేసిన ఎల్.సురేష్ అల్లూరి సీతారామరాజు జిల్లాకి బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయనకు ఎస్పీ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఏడాది జరిగిన ఎన్నికలు సిబ్బందితో కలసి సమర్థవంతంగా నిర్వహించారు. రెండేళ్ల పాటు చట్టపరమైన విధులు నిర్వహించి అన్ని రాజకీయ పార్టీలతో సమన్వయంగా వ్యవహరించి మంచి ఉద్యోగిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఇతని స్థానంలో నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ రానున్నారు. శుక్రవారం విధుల్లో చేరుతారని సమాచారం.

నేడు విద్యుత్ నిలుపుదల

నాతవరం : మండల కేంద్రంలో విద్యుత్ సబ్‌స్టేషన్లలో కొత్త బేకరు పనులు చేయడం వల్ల శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని నర్సీపట్నం విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.డి.వి రామకృష్ణ తెలిపారు. నాతవరం, మర్రిపాలెం, వెన్నెలపాలెం, చమ్మచింత, లింగంపేట, చిక్కుడుపాలెం, తాండవ, మాధవనగరం, మన్యపురట్ల డి.యర్రవరం, ములగపూడి, వల్సంపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేశామని వినియోగదారులు గ్రహించాలని ఆయన కోరారు.

దుర్గా మల్లేశ్వరస్వామి హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఎండోమెంట్ సిబ్బంది

నర్సీపట్నం : శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం 36 రోజులకు హుండీ ఆదాయం రూ.4,10,226 వచ్చిందని ఈవో కె.దివ్యతేజ తెలిపారు. పోలీసు బందోబస్తు మధ్య హుండీ ఆదాయం లెక్కించారు. లెక్కింపులో దేవదాయశాఖ సిబ్బంది, ఆలయ ఆలయ అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకునికి 20 కేజీల లడ్డూ



దాతలు బహూకరించిన లడ్డూ

దేవరాపల్లి : వినాయక నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని మండల వ్యాప్తంగా గ్రామగ్రామాన వినాయకుని మండపాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో వినాయక నిమజ్జన మహోత్సవాలు, భారీ అన్నసమారాధనలు నిర్వహిస్తున్నారు. నాగయ్యపేటలోని వినాయకుడికి గ్రామానికి చెందిన దాసరి అర్జున, నాగమణి దంపతులు 20 కేజీల లడ్డూను గురువారం రాత్రి అందజేశారు. ఈ సందర్భంగా అర్జున, నాగమణి దంపతులు వినాయకునికి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. వినాయక నిమజ్జన మహోత్సవం రోజున లడ్డూను వేలం పాట నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ముమ్మరంగా పశువులకు గాలికుంటు టీకాలు

- గోశాల షెడ్లకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు
- శాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్

నాతవరం : గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తుగా వ్యాక్సిన్ వేస్తున్నామని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టరు ఎం.చంద్రశేఖర్ అన్నారు. ఆయన గురువారం శృంగవరం నాతవరం పశువైద్యశాలలను ఆకస్మికంగా సందర్శించి రికార్డులు పరిశీలించారు. మర్రిపాలెం ఎం.బి.పట్నం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను పరిశీలించి ఎం.బి.పట్నంలో పశువులకు వేస్తున్న వ్యాక్సిన్లు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశువులకు, గొర్రెలు, మేకలకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందుగా వ్యాక్సిన్లు వేస్తున్నామన్నారు. అదే విధంగా సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వ్యాక్సిన్లు వేసే విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా బాధ్యతగా పని చేయాలని క్షేత్ర స్థాయిలో పని చేసే సిబ్బందికి ఆదేశించామన్నారు. పశుగోశాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి సరైన విధి విధానాలు ఇంకా రాలేదన్నారు.



పశువులకు వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్

ప్రస్తుతం గోశాల షెడ్ల విషయంపై తాను ఏమీ చెప్పనలేన్నారు. అనంతరం గోపాలమిత్రల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లాడ వెంకటరమణ శృంగవరంలో కలిసి మండలంలో ప్రధాన సమస్యలతో పాటు గోపాలమిత్రల సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పశువైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తాతబాబు మృతి పార్టీకి తీరని లోటు

బుచ్చెయ్యపేట : మండల సీనియర్ నాయకుడు దిబ్బిడి మాజీ ఎంపీటీసీ సియాద్రి తాతబాబు(73) మరణం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ప్రభుత్వ మాజీ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. తాతబాబు అనారోగ్యంతో గురువారం దిబ్బిడిలో మృతి చెందారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణ మూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దన రావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ముఖ్య నాయకులతో కలిసి ధర్మశ్రీ తాతబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. బుచ్చెయ్యపేట వైస్ ఎంపీపీ-2 గొంపా చినబాబుకు తాతబాబు మేనమామ కావడంతో ధర్మశ్రీ వైస్ ఎంపీపీని పరామర్శించారు. తాతబాబు కోఆపరేటివ్ అధ్యక్షుడిగా ఎర్రవాయి గ్రామాల్లో వివాదాలు పరిష్కారానికి పెద్దమనిషిగా, రైతు సంఘ నాయకుడిగా పలు సేవలు అందించారని పలువురు కొనియాడారు. వడ్డాదిలో మరో సీనియర్ నాయకుడు కుబిరెడ్డి సత్తిబాబు మృతి చెందగా అతని కుటుంబ సభ్యులను కూడా ధర్మశ్రీ పరామర్శించారు. సర్పంచ్‌లు పెదిరెడ్ల మాణిక్యం, గొంపా అప్పారావు, సుంకరి గాంధీ, సత్యనారాయణ, దొండా అచ్చియ్యదొర, వెలుగుల అయ్యన్నదొర పాల్గొన్నారు.



తాతబాబు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ధర్మశ్రీ

పౌర సేవలను పారదర్శకంగా అందించాలి



ముషిడిపల్లి సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్



కె.ఎం.పాలెంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

దేవరాపల్లి : గ్రామ సచివాలయంలో పౌర సేవలను పారదర్శకంగా అందించాలని స్థానిక ఎంపీడీవో కె.చంద్రశేఖర్ సూచించారు. ఈ మేరకు ముషిడిపల్లి గ్రామ సచివాలయాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయంలో రికార్డులను తనిఖీ చేసి అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి వంటశాల, మరుగుదొడ్లను పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.
అనంతరం కె.ఎం.పాలెంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి వానపాములు విడుదల చేసి ఎరువును తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈయన వెంట స్థానిక పంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

లబ్ధిదారులకు మేలు, పథకానికి పేరు తేవాలి

రోలుగుంట : ఉపాధి పథకం ద్వారా జరిగిన పనులపై నిర్వహించనున్న తనిఖీ కార్యక్రమంలో లబ్ధిదారులకు మేలు, పథకానికి మంచి పేరు వచ్చేలా తమ బృందం తనిఖీలుండాలని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు సామాజిక తనిఖీ బృందానికి సూచించారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో గురువారం మధ్యాహ్నం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి సామాజిక తనిఖీ సమన్వయ సమావేశాన్ని ఏపీవో కోసూరి సూర్యామణి సామాజిక తనిఖీ బృందం, సంబంధిత శాఖల అధికారులు, ఈ శాఖలో పనిచేస్తున్న సంకేతిక సహాయకులు, వీఆర్పీలు, ప్రజాప్రతినిధులతో నిర్వహించారు. ఇక్కడ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో గల 24 పంచాయతీలో పీఆర్,ఆర్.డబ్ల్యూఎస్, హౌసింగ్. ఎస్ఎస్ఏ తదితర శాఖలకు సంబంధించి జరిగిన వివిధ రకాల పనులు, వాటికి మంజూరైన సుమారు రూ.18 కోట్ల నిధుల ఖర్చుకు సంబంధించి గ్రామాలు వారీగా చర్చించారు. వీటికి సంబంధించిన రికార్డులను తనిఖీ బృందానికి స్వాధీనం చేశారు. సామాజిక తనిఖీ బృందం ఎస్ఆర్‌పీ ఎం.నాగరాజు మాట్లాడుతూ శుక్రవారం నుంచి పది రోజుల పాటు గ్రామాల్లో పలు శాఖల ద్వారా జరిగిన పనుల తనిఖీ కార్యక్రమాన్ని తమ బృందం తనిఖీ చేస్తారని, స్థానికులు సహకారాన్ని అందించాలని కోరారు. సమావేశంలో పీఆర్ ఏఈ ఉమామహేశ్వరుడు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రాజు, సర్పంచ్‌లు లగుడు కృష్ణంనాయుడు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాడుగుల రూరల్ : మండలంలో విద్యుత్ లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనులు చేపడుతున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు నర్సీపట్నం ఏపీఈపీడీసీఎల్(ఆపరేషన్స్)ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.డి.వి.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో అన్ని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, ఎం.కోడూరు విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.
కె.కోటపాడు : ఎ.కోడూరు ఫీడర్ పరిధిలో గల గ్రామాల్లో ఈ నెల 13న శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఏ.ఈ చంద్రశేఖర్‌రావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల నిమిత్తం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు. ఎ.కోడూరు, పాడుగుపాలెం, సూర్రెడ్డిపాలెం, సింగన్నదొరపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.
నర్సీపట్నం: నర్సీపట్నం 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఫీడర్ పరిధిలో ఉన్న ధర్మసాగరం, అన్నవరం, యండపల్లి, వజ్రగడ, తమ్మయ్యపాలెం, చంద్రయ్యపాలెం, గంగవరం, మల్లవరం గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గిరిజన సంక్షేమానికి కేంద్ర సహకారం

మాడుగుల రూరల్ : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సద్వినియోగపర్చుకోవాలని, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అన్నారు. ప్రధానమంత్రి జనజాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం తాటిపర్తి పంచాయతీ శివారు చినకూర్మానాథపురం, కాశీపురం గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో 22 పథకాలు గిరిజన సంక్షేమానికి అమలు చేస్తుందన్నారు. సర్పంచ్ అల్లంగి వెంకట గౌరీదేవి అధ్యక్షతన జరిగిన గ్రామ సభల్లో ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాలరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



చినకూర్మనాథపురంలో జరిగిన గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజారామ్

భక్తి శ్రద్ధలతో దీపార్చన



కె.జె.పురంలో దీపార్చన కార్యక్రమం

మాడుగుల రూరల్ : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా, గురువారం రాత్రి గ్రామాల్లో మండపాల వద్ద దీపార్చన నిర్వహించారు. కె.జె.పురం పూర్వ విద్యార్థులు పవర్ టాలెంట్ యూత్ ఆధ్వర్యంలో దీపార్చన నిర్వహించారు. ఉత్సాహంగా దీపాలు వెలిగించారు. గత 46 సంవత్సరాల పాటు ఏటా నిర్విరామంగా ఉత్సవాలు నిర్వహిస్తున్న టెంట్ హౌస్ రాము ఇంటి వద్ద దీపార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే

మాడుగుల : ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో ప్రబలుతున్న వైరల్ ఫీవర్స్‌ను గుర్తించి అక్కడికక్కడే వైద్యం అందిస్తున్నామని కింతలి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.ఎం.నాయుడు అన్నారు. ఇప్పటికే గిరిజన గ్రామాల్లో వారం రోజుల నుంచి జ్వరాలున్నవారికి ఇంటికి వెళ్లి వైద్యం అందిస్తున్నామన్నారు. జ్వరతీవ్రత అధికమైనవారికి పీహెచ్‌సీలో వైద్యం అందిస్తున్నామన్నారు.

14న లక్ష బిల్వార్చన

మాడుగుల : స్థానిక మూడు రోడ్ల జంక్షన్ వద్ద ఈ నెల 14 వ తేదీన వినాయక నవరాత్రుల్లో భాగంగా లక్ష బిల్వార్చన కార్యక్రమం జరగనుందని, బాల వినాయక యువజన సేవా సంఘం సభ్యులు తెలిపారు. అదే రోజు 8 గంటల నుంచి రుద్రాభిషేకం వినాయక మండపం వద్ద జరగనుందన్నారు. ఈ కార్యక్రమం 40 ఏళ్లుగా వరుసగా జరుగుతూ వస్తుందని సంఘ సభ్యులు తెలిపారు. గ్రామంలో గల భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని బాలవినాయక సేవా సంఘం వారు కోరారు.

సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటు

కె.కోటపాడు : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరనిలోటు అని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు అన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా దేశంలో సీపీఎం పటిష్టతకు ఆయన కృషి చేసినట్టు తెలిపారు. సీపీఎం పార్టీ తరపున కార్మిక, కర్షక వర్గాలకు మేలు చేసేలా ప్రభుత్వాలతో ఆయన అలుపెరగని పోరాటం చేశారని ముత్యాలనాయుడు అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు.

రోలుగుంటలో భారీ అన్నసమారాధన



కొండపాలెం రామమందిర వీధిలో గణపతికి పూజలు

రోలుగుంట : మండలంలో పలు గ్రామాల్లో గణపతి నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కొండపాలెం రామమందిర వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద గురువారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. రోలుగుంట శెట్టిబలిజి వీధిలో శివయూత్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్న సమారాధన జరిపారు. స్థానికులతో పాటు కొవ్వూరు, కె.నాయుడుపాలెం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ప్రసాదం స్వీకరించారు.

పంట పొలాలకు 400 క్యూసెక్కుల నీరు విడుదల



ప్రధాన కాలువ ద్వారా పంట పొలాలకు ప్రవహిస్తున్న తాండవ నీరు

నాతవరం : తాండవ రిజర్వాయరు నుంచి ఆయకట్టు భూములకు కాలువల ద్వారా 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని ప్రాజెక్టు జేఈ రామకృష్ణ అన్నారు. ఆయన గురువారం ఉదయం ప్రాజెక్టు ప్రధాన గేట్లు ఎత్తి కుడి ఎడమ కాలువల ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండవ రిజర్వాయరు నీటి మట్టం గురువారం ఉతయానికి 378.3 అడుగులకు పెరిగిపోయిందన్నారు. ప్రాజెక్టు ప్రమాద స్థాయిని గ్రహించి యుద్ధ ప్రతిపాదికన పంట పొలాలకు నీటిని విడుదల చేసామన్నారు. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 400 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు.

అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ నూతన కార్యవర్గం



చోడవరం: వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్న కొత్తకోట అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ సంఘం నూతన కార్యవర్గం గురువారం ఏర్పడింది. సంఘ వార్షికోత్సవాలు రావికమతం మండలం కొత్తకోట గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడుగా గర్రెడ్డి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడుగా బద్రి రాజాతోపాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రతి ఏటా అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ ద్వారా పేదలకు అనేక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని రిటైర్డ్ హెడ్‌మాస్టార్ గుమ్ముడు ప్రకాష్ సంఘ సంఘ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వరిలో ఆకుముడత నివారించాలి



వరిలో ఆకుముడత పురుగు సోకిన పొలం

బుచ్చెయ్యపేట : వరి పొలాల్లో విస్తారంగా వ్యాపిస్తున్న ఆకుముడత పురుగు నివారణకు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రధాన శాస్త్రవేత్త రాజ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి భాస్కరరావు తెలిపారు. గురువారం వీరు మండల కేంద్రం బుచ్చెయ్యపేట, దిబ్బిడి, కొమళ్లపూడి, లోపూడి తదితర గ్రామాల్లో రైతుల వరి పొలాలను పరిశీలించారు. ఇటీవల పది రోజులుగా ఏర్పడ్డ తుఫాను వర్షాలకు వాతావరణం చల్లగా ఉండడంతో వరి పొలాల్లో ఆకుముడత పురుగు ఎక్కువగా ఆశించినట్టు గుర్తించారు. వరి ఆకులు నిలువునా ముడుచుకుని ఉంటాయని, ఆకుమడతలు విప్పి చూడగా పసుపు లేదా ఆకుపచ్చ గొంగలి పురుగులు కనిపించిన పొలంలోకి దిగితే రెక్కల పురుగులు ఎగిరిన ఆకుముడత పురుగు ఆశించినట్టుగా రైతులు గుర్తించాలన్నారు. వెంటనే పొడవాటి తాడు చివర్లను ఇద్దరు మనుషులు పట్టుకుని రెండు గట్లు మీద నుండి వరి ఆకుల మీద నుండి లాగుతూ ఉంటే పురుగులు కింద ఉన్న నీటిలో పడతాయన్నారు. వెంటనే పొలంలో ఉన్న నీటిని బయటకు తీయడం వల్ల పురుగు నీటిలో కొట్టుకుపోయి తెగులు బెడద తప్పుతుందన్నారు. వరి పొలంలో పక్షి స్థావరాలు ఏర్పాటు చేయడం వల్ల పురుగును నివారించవచ్చన్నారు. 2 గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును లీటరు నీటిలో కలిపి ఎకరాకు 400 గ్రాముల పొడి మందును పంటంతా తడిచేలా పిచికారి చేయాలన్నారు. అలాగే ఫ్లూబెండమైడ్ 20 డబ్లుడీజీ మందును లీటరు నీటిలో 0.25 గ్రాములు కలిపి పిచికారి చేయాలన్నారు. ఎకరాకు 50 గ్రాముల మందును పిచికారి చేయాలన్నారు. క్లోరాంట్రనిలిప్రోల్ 18.5 ఎస్‌సి మందును 60 మిల్లీలీటర్ల మందును ఎకరాకు పరిసడ్డ నీటిలో కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. పై మందుల్లో ఏదో ఒక మందును ఆకుముడత తగిలిన వరి పొలానికి పిచికారి చేస్తే ఆకుముడతతో పాటు కాండం తొలిచే పురుగు నివారణ అవుతుందన్నారు.

అగ్గి తెగులు, పొడతెగులు నివారణ

వరిలో అగ్గి తెగులు కనిపిస్తే యూరియా వాడకాన్ని తగ్గించి ట్రైసైక్లోజోల్ పొడిమందును లీటరు నీటిలో 0.6 గ్రాముల చొప్పున ఎకరాకు 120 గ్రాముల మందును పిచికారి చేయాలన్నారు. వరిలో పాము పొడ తెగులు లేదా పాచి తెగులు లక్షణాలు కనిపిస్తే హెక్సాకొనజోల్ లేదా ప్రొపికోనజోల్ లేదా వాలిడామైసిన్ మందును పిచికారి చేయాలన్నారు. పొలం గట్లకు కూడా మందును పిచికారి చేయాలని సూచించారు.

ఘనంగా అన్న సమారాధనలు

మాడుగుల రూరల్ : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో వినాయక మండపాల వద్ద గురువారం అన్నసమారాధనలు జరిపారు. కె.జె.పురం గ్రామంలో ఏటా చేపడుతున్న మహోత్సవాల్లో భాగంగా బొడ్డేడ కొండమ్మ ఇంటి వద్ద గల వినాయక మండపం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో వర్తక సంఘం, మెటారు వర్కర్సు యూనియన్, ఆటో వర్కర్సు ఆధ్వర్యంలో మోదకొండమ్మ పాదా వద్ద ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక ఉత్సవాల్లో భాగంగా అన్నసమారాధన జరిపారు. ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. కింతలి వల్లాపురం సంత బయలు వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద కూడా భారీ అన్న సమారాధన జరిపారు. ఎం.కోడూరు శివాలయంలో గల వినాయక ఆలయంలో నిర్విరామంగా పూజలు నిర్వహిస్తున్నారు.



ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో వరసిద్ధి వినాయకుడికి పూజలు చేస్తున్న ఎంపీపీ రాజారామ్ తదితరులు

కె.జె.పురంలో డెంగ్యూ కేసు

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం మూడో వార్డులో ఒక డెంగ్యూ కేసు నమోదు అయింది. ఒక బాలికకు వారం రోజుల క్రితం విశాఖ కింగ్‌జార్జి ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించగా, డెంగ్యూగా నిర్ధారణ కావడంతో, ఈ విషయం మూడు రోజులు క్రితం కె.జె.పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సిబ్బందికి తెలియపర్చారు. దీంతో అప్రమత్తం అయ్యారు. డెంగ్యూ కేసు నిర్ధారణ అయిన ఇంట్లో మరియు ఇంటి పరిసర ఇళ్లలో వారికి కూడా రక్త పరీక్షలు నిర్వహించారు. వైద్యసేవలు అందించారు. దీంతో పాటు చుట్టుపక్కల వున్న 90 ఇళ్లలో గురువారం క్లోరినేషన్ చేయించి, వీధులను శుభ్రం చేశారు. కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.లీలాప్రసాద్, చోడవరం మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.వి.రమణ, స్థానిక సర్పంచ్ జామి రమణబాబు, పర్యవేక్షణలో పూర్తి స్థాయిలో క్లోరినేషన్ చేశారు. డెంగ్యూ సోకిన బాలిక ఆరోగ్యం బాగానే ఉందని వైద్యాధికారి లీలాప్రసాద్ తెలిపారు.



కె.జె.పురంలో క్లోరినేషన్ చేయిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి రమణ

బాల్య వివాహాలు అరికట్టాలి

కె.కోటపాడు : పద్దెనిమిదేళ్లు నిండకుండా పిల్లలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని సీడ్ ఆర్గనేజేషన్ సీఎస్‌డబ్ల్యూ ఉషారాణి, డీడీఏసీ కౌన్సిలర్ అర్జున్ అన్నారు. మండలంలో చౌడువాడ, గొందుపాలెం, దాలివలస, గుల్లేపల్లి గ్రామాల్లో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విద్యాహక్కు చట్టప్రకారం ప్రతి విద్యార్థికి చదువులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని అర్జున్ అన్నారు. పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై ప్రభుత్వాలు కఠిన చట్టాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పాఠశాలల ఉపాధ్యాయులు బి.సన్నిబాబు, ఎ.సత్యంనాయుడు, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



దాలివలసలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఉషారాణి, అర్జున్

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

దేవరాపల్లి: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అధిక పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని నాగయ్యపేట ఏఎన్ఎం సత్యవతి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా మండలంలోని నాగయ్యపేట, సీతంపేట గ్రామాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సును నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పాల ప్యాకెట్లు, కోడి గుడ్లు, బియ్యం, కందిపప్పు తదితర ఆహార సామాగ్రితో రూపొందించిన ఐసీడీఎస్ చిహ్నం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
కె.కోటపాడు : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం పొందుతారని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. కె.కోటపాడు ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన పౌష్టికాహార వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మార్కెట్‌లో తక్కువ ధరకే లభ్యమవుతున్న పదార్థాలతో తయారు చేసిన పౌష్టికాహారాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పీవో మంగతాయారు పాల్గొన్నారు.



నాగయ్యపేటలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది.